
APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్  శుక్రవారం  13-02-2026  సంపుటి : 1  సంచిక : 152  ఎడిటర్ : కుమార్  పేజీలు : 4  వెల రు : 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar

## ప్రశాంతంగా రైతు, కార్మిక సంఘాలు సమ్మె



● కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన కర్షక, కార్మికులు సమ్మె ● మద్దతు తెలిపిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలు, భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాలు సమ్మెను చేపట్టాయి. విద్యుత్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రవాణా, ఆరోగ్యం, విద్య, గ్యాస్, నీటి సరఫరా, మైనింగ్, గ్యాస్ పైప్ లైన్ వంటి రంగాలకు చెందిన కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొనగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## ఇది మత స్వేచ్ఛపై దాడి

● వందేమాతరం తప్పనిసరిపై జమియత్ ఆగ్రహం ● కేంద్రం ఏక పక్ష నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శ ● ఆర్టికల్ 25తో పాటు అనేక సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించడమే ● జమియత్ ఉలామా-ఇ-హింద్ మండిపాటు



## రాహుల్ సభ్యత్వం
# రద్దు చేయండి

### సభ్యత్వ రద్దు కోరుతూ లోక్‌సభలో బీజేపీ షాక్




● భారత్ - అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాలపై తీవ్ర విమర్శలు ● రాహుల్ వ్యాఖ్యలు దేశ ప్రతిష్ట మసకబార్చేలా ఉందని మండిపడిన అధికారపక్షం

లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ లక్ష్యంగా బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. ఇటీవల ఆయన పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, సభను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సభా హక్కుల ఉల్లంఘన నోటీసును దాఖలు చేశారు. రాహుల్ గాంధీ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై, వ్యవస్థలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీజేపీ తన నోటీసులో పేర్కొంది.

## నీటి పారుదలశాఖకు
# మహార్దశ

● సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం ● పలు కీలక అంశాలపై చర్చ.. ఆమోదం ● నీటిపారుదలశాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం ● 24 అజెండా అంశాలకు ఆమోదం



## గిద్దలూరులో కదం తొక్కిన కార్మికులు

– ఎరుపుదలంగా మారిన రోడ్లు




గిద్దలూరు పట్టణంలో కార్మికుల నిరసనలతో ప్రధాన రహదారులు ఎరుపు జెండాలతో కళకళలాడాయి. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించగా, కార్మికులు నినాదాలతో పట్టణాన్ని మార్మోగించారు. తమ హక్కుల సాధన కోసం కదం తొక్కిన కార్మికులు రోడ్లపై శక్తివంతమైన ప్రదర్శన చేశారు.

## వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా
# అభివృద్ధి ఆపలేరు!

● యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం ● యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం ● ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది ● విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం ● భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు ● వైసీపీ సభ్యుల ఆరోపణలకు ధీటుగా సమాధానం ఇచ్చిన మంత్రి లోకేష్




## సభ గౌరవం కాపాడే
## బాధ్యత సభ్యులదే



బడ్జెట్ సమావేశాల తొలి రోజు అసెంబ్లీలో గవర్నర్ ప్రసం గం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలు తీవ్రమైన ఆందోళన కలిగించాయని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ, పత్రాలు చించివేయడం వంటి చర్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకర మన్నా రు. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్య దేవాలయం. వేలాది మంది పోటీ పడే ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో కేవలం 175 మందికే సభ్యులుగా ఉండే అరుదైన గౌరవం లభిస్తుంది. ఆ గౌరవాన్ని కాపాడటం ప్రతి సభ్యుడి బాధ్యత అన్నారు. విభేదాలు ఉండొచ్చు, అభిప్రాయ భేదాలు సహజం. కానీ అవి సభా మర్యాదలను దాటి వెళ్లకూడదన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులుగా ప్రతి సభ్యుడు తమ ప్రవర్తన ద్వారా ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత కలిగి ఉండాలి.

## నష్టాల్లో స్టాక్
# మార్కెట్లు



● మార్కెట్లను ముంచిన టెక్ షేర్లు ● ఐటీ షేర్ల దెబ్బకు కుదేలైన సెన్సెక్స్, నిఫ్టీ ● 558 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 146 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

## మేం ఎవరినీ
# దూషించలేదు



ఎంపీలను రెచ్చగొట్టారనే రిజిజు ఆరోపణలను తిరస్కరించిన ప్రియాంక

లోక్సభ స్పీకర్ ఛాంబర్లో జరిగిన ఘటనపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఖండించారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదని, అలాగే దూషించలేదని స్పష్టం చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణంలో మాట్లాడుతూ ఈ మేరకు తెలిపారు.

# సంగమేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు మండల స్థాయి అధికారుల సమీక్ష

పొన్నలూరు : ప్రజలకి చేరువ

మండల కేంద్రమైన పొన్నలూరు తహశీల్దార్ కార్యాలయంలో గురువారం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పొన్నలూరు మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.



**అధికారుల ఆదేశాలు మరియు నిర్ణయాలు:**

సమావేశంలో పాల్గొన్న తహశీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో డాక్టర్ పి సుజాత  మాట్లాడుతూ, శివరాత్రి రోజున ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తుగా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలు భాగంగా  ఎస్ఐ సుబ్బారావు మాట్లాడుతూ, ఆలయ పరిసరాల్లో తోపులాటలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలను కేటాయించి పటిష్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు.?వైద్య సేవల లో భాగంగా భక్తుల ఆరోగ్య దృష్ట్యా డాక్టర్ రవి కిరణ్  ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులతో పాటు అంబులెన్స్ సదుపాయాన్ని అందుబాటులో ఉంచుతామని ఆమె తెలిపారు. భక్తులకు త్రాగునీరు, చలువ పందిళ్లు, మరియు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# సమీర్ నిశ్చితార్థ వేడుకల్లో షేక్ నాయబ్ రసూల్ (బడే)

చంద్రశేఖరపురం : ప్రజలకు చేరువ



మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ పాచ్చామియా కుమారుడు షేక్ సమీర్ నిశ్చితార్థ వేడుకలు పామూరులోని అనిల్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సాంప్రదాయ పద్ధతుల్లో నిశ్చితార్థ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమమునకు టిడిపి సీనియర్ నాయకులు షేక్ నాయబ్ రసూల్ (బడే), చంద్రపూర్ (మహారాష్ట్ర) హాజరై సమీర్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ పాచ్చామియా కు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో షేక్ నాయబ్ రసూల్ టీచర్ , కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్ బీ బుజ్జి తదితరులు పాల్గొన్నారు

# 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి




చంద్రశేఖరపురం : ప్రజలకు చేరువ

కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఊసా రాజలక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె లో భాగంగా స్థానిక శివాలయం వద్ద నుంచి ప్రధాన రహదారి మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులకు రక్షణ గా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ ల వల్ల కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ చట్టాలు కార్మికుల సంక్షేమానికి గొడ్డలి పెట్టు లాంటిది అన్నారు. పనిగంటలు తగ్గింపు, సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, రక్షణ తదితర సమస్యలు పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్ తిరుపతి రెడ్డి, వీఆర్ఏల సంఘం నాయకుడు ఇండ్ల రామలింగయ్య, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తిరుమలమ్మ, నాగమ్మ, అంగన్వాడి నాయకులు నారాయణమ్మ, మాధవి, కార్మికులు పాల్గొన్నారు.

# గిద్దలూరు ఎక్సైజ్ పరిధిలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం:

## జిల్లా ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు

గిద్దలూరు/ఒంగోలు:ప్రజలకు చేరువ



ప్రకాశం జిల్లా గిద్దలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నూతన మద్యం దుకాణాల లైసెన్సుల మంజూరుకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి (ఒంగోలు) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, గిద్దలూరు రూరల్ మండలం మరియు రాచర్ల మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం రెండు మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈ నూతన దుకాణాల నిర్వహణ కాలపరిమితి 2026 ఫిబ్రవరి 23వ తేదీ నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమల్లో ఉంటుంది.- ఈ లైసెన్సుల కోసం ఆసక్తి గల వ్యాపారవేత్తలు తమ దరఖాస్తులను 2026 ఫిబ్రవరి 21వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుముగా రూ. 2,00,000/- (అక్షరాలా రెండు లక్షల రూపాయలు) నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఈ రుసుము కేవలం దరఖాస్తు ప్రక్రియకు మాత్రమేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి చెల్లించబడదని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను అటు ఆన్‌లైన్ ద్వారా లేదా ఇటు ఆఫ్‌లైన్ ద్వారా కూడా సమర్పించే వెసులుబాటు కల్పించారు.

- మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ, 2026 ఫిబ్రవరి 23వ తేదీన ఒంగోలులోని 'ప్రకాశం భవన్' వేదికగా బహిరంగ లాటరీ పద్ధతిని నిర్వహించనున్నారు. లక్కీ డిప్ ద్వారా లైసెన్సు పొందిన అభ్యర్థుల పేర్లను అదే రోజు ప్రకటిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

# కాశిరెడ్డి కుంటకు మహర్దశ





- అభివృద్ధికి రూ. 2కోట్లు మంజూరు
- మరో రూ.2కోట్లకు ప్రతిపాదనలు
- ఫలిస్తున్న శాసనసభ్యులు ముత్తుముల కృషి
- వైసీపీ ప్రభుత్వంలో తూతూమంత్రంగా జరిగిన కట్ట పనులు
- గత ప్రభుత్వంలో నిరుపయోగంగా ఉన్న ఎక్సర్సైజ్ యంత్రాలు

గిద్దలూరు : ప్రజలకు చేరువ

గిద్దలూరు పట్టణంలోని నరవ రోడ్డు లోని కాశిరెడ్డికుంటకు మహర్ణవ పట్టింది. కుంటను అభివృద్ధి చేసి కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు, చిన్నపిల్లల పార్కు కుంట కట్టపై ఏర్పాటు చేసేందుకు పూడికతీత పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి బీపీఎస్, ఎస్ఆర్ ఎస్ నిధుల నుంచి రూ.2కోట్లు మంజూరు చేయించారు. ఈ మొత్తం కుంట అభివృద్ధికి సరిపోదని ఇంజనీరింగ్ అధికారులు చెప్పడంతో మరో రూ.2కోట్ల నిధులు మంజూరుకు శాసనసభ్యులు అశోక రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అదనంగా కావలసిన రూ.2కోట్ల నిధులకు సంబందించి పనుల ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించారు. ఈలోగా మంజూరైన నిధులకు సంబంధించి ముందుగా ఏఏ పనులు చేయాలి అనే విషయంపై ఇంజనీరింగ్ అధికారులు డీపీఆర్ ను తయారు చేస్తున్నారు. డీపీఆర్ చివరి దశలో ఉండగా ఇది పూర్తయితే అంచనాల ఆమోదం తీసుకుని టెండర్కు వెళ్తుంది. ఈలోగా రెండోసారి పంపించిన రూ.2కోట్ల ప్రతిపాదనలకు కూడా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మొత్తం రూ.4కోట్లు మంజూరైతే ఇప్పటికే పూడిపోయి ఉన్న కాశిరెడ్డికుంటలో నీటిని మొత్తం తోడివేసి పూర్తిగా పూడికతీత పనులు చేపట్టి కుంట చుట్లూ వాకింగ్ ట్రాక్, ఒక వైపు చిన్నపిల్లల పార్కు, ట్రాక్పై చెట్ల పెంపకం, బెంచీల ఏర్పాటు, ఎక్సర్సైజ్ చేసుకునే పరికరాల ఏర్పాటు చేస్తారు. కుంట చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మించి వాకింగ్ ట్రాక్కు ఇ బ్బంది లేకుండా చేస్తారు. గిద్దలూరు పట్టణంలో ఇప్పటివరకు ఎక్కడా వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్ల మార్జిన్లలో వాకింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పనులు కార్యరూపం దాల్చితే పట్టణవాసులకు మంచి వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రానున్నది. కాశిరెడ్డికుంట అభివృద్ధిపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వ హించి నిధుల మంజూరుపై ప్రత్యేకంగా శ్రద్ధచూపుతున్నారు.

### తూతూ మంత్రంగా పనులు

గత వైసీపీ పాలనలో కాశిరెడ్డికుంట అభివృద్ధికి స్వచ్ఛ ఆంధ్ర పథకం కింద కొంతమేర నిధులు మంజూరయ్యాయి. అప్పటి కాంట్రా క్టర్ తూతూ మంత్రంగా కొద్దిమేర పనులు చేసి అర్ధాంతరంగా పనులను నిలిపివేశారు. కొన్ని జిమ్ పరికరాలను పనులు పూర్తికాక ముం దే కుంటపై ఏర్పాటు చేయగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. కుంట స్థలం ఆక్రమణలకు గురికాకుండా కాంపౌండ్వాల్ను నిర్మించడం కొం తలోకొంత మేలు చేసింది. చేసిన పనులు కూడా నాసిరకంగా ఉండ దంతో పలువురు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు పను లను తనిఖీ చేశారు. మొత్తం మీద పనులన్నీ ఆగిపోవడంతో ప్రజాప్ర భుత్వం అధికారంలోకి రాగానే కుంట అభివృద్ధిపై శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి ఇప్పటికే రూ.2కోట్లు మంజూరు చేయించి మరో రూ.2కోట్ల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తు న్నారు. కుంట నీటి మధ్యలో జాతీయ పతాకాన్ని రెపరెప లాడించేం దుకు వీలుగా ప్రత్యేకంగా డిజైన్ చేయిస్తున్నారు. మొత్తమ్మీద కాశిరెడ్డి కుంటకు మహర్దశ పట్టనున్నది. ఈ విషయమై మున్సిపల్ కమిష సర్ రమణబాబును వివరణ కోరగా.. శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి కృషి ఫలితంగా రూ.2కోట్ల నిధులు మంజూరు కాగా డీపీఆర్ ను సిద్ధం చేస్తున్నామని, అది పూర్తికాగానే అంచనాలను ఆమోదించి టెండర్ పిలుస్తామని, మరో 3 నెలల్లో పనులు మొదలయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరో రూ.2కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, అవి కూడా మంజూరైతే పూర్తి స్థాయిలో కాశిరెడ్డికుంట అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

# సుభాషరోడ్డులోని బీ సీ హాస్టలను తనిఖీ చేసిన జిల్లా అధికారి




కనిగిరి : ప్రజలకి చేరువ

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా అధికారి ఎస్ నిర్మలజ్యోతి గురువారం సుభాషరోడ్డులోని బీ సీ హాస్టలను తనిఖీ చేయడం జరిగింది. గత రెండు రోజుల క్రిందట జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ లో భాగంగా ఇక్కడ పనిచేయుచున్న వార్డన్ చెన్నయ్య ను సస్పెన్షన్ కు ఆదేశాలు జారీ చేయడమైనది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారి నిర్మలజ్యోతి విచారణ నిమిత్తం కనిగిరి బీ సీ హాస్టలకు రావడం జరిగింది. సబ్జక్ట్స్ వారీగా పిల్లలకు మార్క్స్ ఎన్ని వస్తున్నాయి అనే అంశం మీద ఫీడింగ్ ఏవిదంగా వున్నది తదితర అంశాల పై అధికారి తెలుసుకోవడం జరిగింది. బిల్డింగ్ అద్దె ఎక్కువగా వున్నదని దగ్గరలో వున్న ప్రభుత్వ కార్యాలయానికి త్వరలో హాస్టలను బదిలీ చేయడం జరుగుతుందని తెలిపారు. విచారణలో భాగంగా జిల్లా అధికారి వెంట కనిగిరి అసిస్టెంట్ బీ సీ వెల్ఫేర్ అధికారి రవికుమార్ వున్నారు.

# ప్రణాళికాబద్ధంగా చదివితే విజేతలుగా నిలుస్తారు





- జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు షేక్ గయాజ్ భాష

చంద్రశేఖరపురం : ప్రజలకు చేరువ

ప్రణాళికాబద్ధంగా చదివితే విజేతలు మీరేనని జనవిజ్ఞానానికి జాతీయ ఉపాధ్యక్షుడు షేక్ గయాస్ భాష అన్నారు మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూలుకు విచ్చేసిన ఆయన టెన్త్ క్లాస్ విద్యార్థినే విద్యార్థులకు మోటివేషన్ క్లాసు ఇవ్వడంలో భాగంగా అందరూ బాగా చదవాలని రోజుకి 16 గంటలపాటు తప్పనిసరిగా చదివే మీద దృష్టి పెట్టాలని మంచి నిద్ర కూడా ఉండాలని ఒక ప్రణాళికని రూపొందించుకొని చదువుకుంటే మంచి మార్కులు వస్తాయని ఆయన సూచించారు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని టీవీలో సినిమాల పట్ల ఆసక్తి తగ్గించుకోవాలని చదువు మీద దృష్టి పెడితే గొప్ప స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందుతారని ఆయన అన్నారు అదేవిధంగా గురువులు చెప్పినటువంటి మాట విని అనుసరించాలని ఆయన అన్నారు పరీక్షా కేంద్రంలోకి వెళ్లేటప్పుడు ఆందోళన చెందవద్దని ధైర్యంగా వెళ్లి పరీక్షలు రాయాలని ఆయన సూచించారు కేజీబీవీ స్కూల్ లో జరుగుతున్నటువంటి విద్యార్థులు మంచి ఉన్నతమైనటువంటి స్థాయిలో ఉన్నారని అలాగే మీరు కూడా మంచి స్థాయికి రావాలని దానికి ఏకైక మార్గం చదువు మీద దృష్టి పెట్టడమేనని భాష విద్యార్థులకు సూచించారు జేబీవీ ఉపన్యాస పోటీలో రెండో బహుమతి పొందిన కేజీబీవీ విద్యార్థినీని ప్రిన్సిపాల్ , షేక్ రేష్మ షేక్ గయాజ్ భాషా అభినందించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, కేజీబీవీ సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు

# అల్లూరి సీతారామరాజు జాతీయ పురస్కారం అందుకున్న డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్

**గిద్దలూరు : ప్రజలకు చేరువ**




అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ కు అరుదైన గౌరవం దక్కింది విజయవాడ లో బుధవారం రాత్రి అవార్డ్ పంక్షన్ జరిగింది, ఈ సందర్భంగా స్వచ్ఛందంగా సామాజిక అధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు నియోజకవర్గంలో అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు మరియు దాతల సహకారంతో పోలీస్ అధికారులకు , జర్నలిస్ట్ లకు హెల్మెంట్స్, క్యాప్ , మాస్క్ అందచేయుట , అనాథలకు యాచకులకు వసతి కల్పించటం , వికలాంగులకు విల్ చైర్స్ పంపిణీ, నిరుపేద విద్యార్థులు భవిష్యత్తు కొరకు వారు చదువులకు ఆర్థికంగా సహాయం చేయటం , అలాగే మెడికల్ క్యాంపులు పెట్టీ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించటం , బడుగు బలహీన వర్గాలకు వైద్యఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయటం , తదితర సేవాకార్యక్రమాలకు గాను మదర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం. ప్రసాదరావ్ హనుమంతరాయ గ్రంథాలయం గాంధీనగర్ విజయవాడ నందు పేరం శివనాగేశ్వరరావు మల్లాడిప్రసాదరావు హీరోయిన్ ఉప్పలపాటి సంధ్య, సత్తెనపల్లి బుల్లి బాబు, దొడ్డపాటి దాస్ ప్రముఖుల చేతులమీదుగా స్వాతంత్ర్య సమరయోధులు పేరున అల్లూరి సీతరామరాజు జాతీయ అవార్డ్ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ అందుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ ఇంతటి గౌరవ పురస్కారానికి ఎంపిక కావటం పట్ల హర్ష వ్యక్తం చేశారు తనకు చిన్ననాటి నుంచి మదర్ తెరిసా , మహాత్మ గాంధీ, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి అన్నారు అటువంటి మహాత్ములాలు పేరిట అవార్డు అందుకోవటం గర్వంగా ఉందన్నారు ఈ సందర్భంగా మల్లాడి ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఫౌండేషన్ సెక్రటరీ భూపాల్ మాట్లాడుతూ మేము చేస్తున్న సేవా కార్యక్రమాలే మాకు అవార్డు రావడానికి ప్రధాన కారణమన్నారు. అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కు ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్న ఈ గౌరవ పురస్కారాన్ని ప్రతి ఒక్కరికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. పురస్కారం అందుకున్న బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ సంస్థ సభ్యులు మరియు గ్రామస్తులు తదిత రాజకీయ పార్టీ నాయకులు శ్రేయోభిలాషులు అభినందించారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక గర్జన

### – కందుకూరులో సార్వత్రిక సమ్మె విజయవంతం

**కందుకూరు : ప్రజలకి చేరువ**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా కందుకూరు పట్టణంలో ఏఐటీయూసీ , సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఉధృతంగా సాగింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పని గంటలను పెంచడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రయత్నాలను అందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని, పైగా హక్కుల కోసం ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు మేల్కొని తమ హక్కుల సాధన కోసం నడుం బిగించాలని కోరారు. ఈ సమ్మెకు ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు కన్వీనర్ నేతి మహేశ్వరరావు, సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు పూర్తి మద్దతు ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో




ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కె. మురళి, వై. ఆనందమోహన్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మాచారి పాల్గొన్నారు. అలాగే పెయింట్ వర్కర్స్ యూనియన్ నేతలు జమ్మలమడుగు రవి, కంకణాల చిన్న బ్రహ్మయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవణమ్మ, నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు ఉప్పుటూరి మాధవరావు, బొజ్జ చంద్రమోహన్, సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, నాదెండ్ల కోటేశ్వరరావు, ఎస్.ఏ. గౌస్, ఎస్.కె మున్వర్ సుల్తానా, సీఐటీయూ నాయకులు సల్మా, మహేష్, ఐద్వా నాయకులు ఎం. పద్మ, ఎస్.కె. మల్లికా, అంగన్వాడీ అధ్యక్షురాలు రాజేశ్వరి, ఆశా నాయకులు వసుంధర, ఆర్టీసీ నాయకులు డి. రమణయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మహాశివరాత్రి వేడుకలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలి డిడిఓ శ్రీనివాసరెడ్డి

**సి ఎస్ పురం, ప్రజలకు చేరువ**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం మరియు భైరవకోన భైరవేశ్వర స్వామి దేవస్థానాల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకలను సమగ్ర కార్యాచరణ రూపొందించి పగడ్బందీగా ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కనిగిరి డివిజనల్ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కె. శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆవరణలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయ విద్యుత్ సరఫరా





ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యాధికారులు అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. త్రాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అత్యవసర సేవల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, అన్నదాన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, దేవస్థాన సిబ్బందికి సహకరించి మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశమునకు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఎస్సై వెంకటేశ్వరా నాయక్ , భైరవకోన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి, పామూరు, సి ఎస్ పురం మండలాల వివిధ శాఖల అధికారులు , ఆలయ సిబ్బంది గ్రామస్తులు హాజరయ్యారు

# కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

**కందుకూరు : ఫిబ్రవరి 12:ప్రజలకు చేరువ**

స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్నెస్ అండ్ విజువల్ ఇంపైర్మెంట్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్ వలి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. మానవ శరీరంలో కళ్లు అత్యంత కీలకమైనవని, విద్యార్థి దశ నుంచే కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి దృష్ట్యా ప్రతి ఒక్కరూ సమయానుకూలంగా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా దృష్టి లోపాలను నివారించవచ్చని పేర్కొన్నారు.?ఈ శిబిరంలో వైద్య నిపుణులు విద్యార్థులకు క్షుణ్ణంగా కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలున్న వారిని గుర్తించి వారికి అవసరమైన కళ్లజోడులను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి మరియు కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది చురుకుగా పాల్గొని సమన్వయపరిచారు. కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది.



# కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలను సందర్శించిన.. రిజిస్ట్రార్ రమణ

**చంద్రశేఖరపురం : ప్రజలకు చేరువ**




సియస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలను గురువారం గుంటూరు, లాం లోని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ యం వి రమణ ,డాక్టర్ జాన్సన్,డాక్టర్ ఎ వి రమణ, డాక్టర్ ముని రత్నం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలోని, లాబ్స్, అదునాతన క్లాస్ రూమ్స్ ,క్రీడాప్రాంగణం,లైబ్రరీ,హాస్టల్స్ లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చెశారు. కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చాలా అద్భుతంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ, డాక్టర్ జాన్సన్, ఎన్ వి రమణ డాక్టర్ మునిరత్నం గార్లను సెక్రటరీడ కరెస్పాండంట్ కదిరి పార్థసారథి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం ని కలిసిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల

**గిద్దలూరు : ప్రజలకు చేరువ**



వెలగపూడి సచివాలయం లో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల ఏపీ డిప్యూటీ సీఎం ని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం ఛాంబర్లో కలిసిన శాసనసభ్యులు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. ముఖ్యంగా రేపు వచ్చే శివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వస్తున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా గిద్దలూరు నియోజకవర్గనికి నిధులు కేటాయించి, ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రదేశాలలో నీటిని తరలించి ప్రజలకు అందించేందుకు నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం కి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం నియోజకవర్గ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని శాసనసభ్యులు అశోక రెడ్డికి తెలిపారు.

# చేవూరు బాధితులకు అండగా బుర్రా మధుసూదన్ యాదవ్

### పోలీసుల వేధింపులు ఆపాలి: మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

**కందుకూరు : ప్రజలకి చేరువ**



గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న పైపుల దహనం కేసును సాకుగా చూపుతూ, విచారణ పేరుతో పోలీసులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను వేధింపులకు గురిచేయడం తగదని మాజీ శాసనసభ్యులు, వైయస్సార్సీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన చేవూరు గ్రామంలో పర్యటించి, పోలీసుల విచారణ పేరుతో నిత్యం ఇబ్బందులు పడుతున్న నక్కల శరత్, కళ్యాణ్ మరియు ఇతర బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జరిగిన సంఘటనపై పోలీసులు పక్షపాత రహితంగా, సక్రమమైన విచారణ జరిపి అసలైన దోషులను గుర్తించాలే తప్ప, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా వైయస్సార్సీపీ కార్యకర్తలపై విరుచుకుపడటం సమంజసం కాదన్నారు. విచారణ పేరుతో ప్రతిరోజూ స్టేషన్ల చుట్టూ తిప్పుతూ మానసిక వేధింపులకు గురిచేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, అమాయకులపై పెడుతున్న అక్రమ ఒత్తిడిని తక్షణమే నిలిపివేయాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కోవిలంపాడు గ్రామంలో ట్రాన్స్ఫార్మరం పై దొంగల యత్నం

**ప్రజలకు చేరువ సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**



మండలంలోని కోవిలంపాడు గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్ఫారాన్ని లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి యత్నించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన నన్నసాని గుంటయ్య పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభంపై ఉన్న ట్రాన్స్ఫారాన్ని దుండగులు దిమ్మెపై నుంచి దించి, అందులోని ఆయిల్ ను దొర్లించి, నట్లు ఊడదీసి లోపలి భాగాలను పరిశీలించి, ట్రాన్స్ఫారంలో ఉన్న తీగలను దొంగలించాలని ప్రయత్నించినప్పటికీ, అందులోని వైరు అమ్మితే ఎక్కువ డబ్బులు రావని భావించి వాటిని అక్కడికక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఉదయం దారిన వెళ్ళిన గ్రామస్తులు ట్రాన్స్ఫారం నేలపై పడివుండటాన్ని గమనించి ఈ ఘటనపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

# మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన భక్తుల భద్రతే మా ప్రాధాన్యత : కనిగిరి సీఐ శ్రీనివాసులు



**కనిగిరి : ప్రజలకి చేరువ**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కనిగిరి మండల పరిధిలోని పుణ్యక్షేత్రాలు, శివాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కనిగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఉప్పుటూరి శ్రీనివాసులు స్పష్టం చేశారు.గురువారం ఆయన మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నందన మారెళ్ల కొండపై వేంచేసి ఉన్న శివాలయాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.?ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ, శివరాత్రి రోజున తెల్లవారుజాము నుండే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నందన మారెళ్ల కొండపైకి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణ, బారికేడ్ల ఏర్పాటుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా కొండ దిగువన మరియు నిర్దేశిత ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం అదనపు సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు.?అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో తాగునీరు, లైటింగ్ వంటి కనీస సౌకర్యాల కల్పనలో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా మఫ్టీలో ఉన్న పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, భక్తులు భయాందోళనలు చెందకుండా ప్రశాంతంగా దర్శనాలు చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మాధవరావుతో పాటు పోలీసు సిబ్బంది మరియు ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

# పొదిలి డిపో నుండి మహాశివరాత్రి ప్రత్యేక బస్సులు

**– భక్తులకు రవాణా సౌకర్యం కల్పించిన ఆర్టీసీ**

**పొదిలి : ప్రజలకి చేరువ**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం పొదిలి ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శంకర్రావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14, 15, 16 తేదీలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ పుణ్యక్షేత్రాలకు ఈ ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.ముఖ్యంగా జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలానికి 10 బస్సులు, రామతీర్థంకు 12 బస్సులు, కోటప్పకొండకు 6 బస్సులు, మరియు త్రిపురాంతకం పుణ్యక్షేత్రానికి 4 బస్సులను నడుపుతున్నట్లు ఆయన వివరించారు. వీటితో పాటు వినోద కార్యక్రమాల కోసం పాకల బీచ్ ఫెస్టివల్‌కు వెళ్లే పర్యాటకుల కోసం ప్రత్యేకంగా రెండు బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సర్వీసులన్నింటిలోనూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యం (మహాలక్ష్మి పథకం) యథావిధిగా వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.శివరాత్రి సందర్భంగా క్షేత్రాలకు వెళ్లే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు డిపో సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తారని, ప్రయాణికులు సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలని శంకర్రావు కోరారు. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో అవసరమైతే మరిన్ని సర్వీసులను నడపడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ఈ సందర్భంగా భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# ముక్తేశ్వరస్వామి ఆలయంలో శాసనసభ్యులు ముత్తుముల కుమారుడు

**బేస్తవారిపేట: ప్రజలకు చేరువ**



బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామంలోని శ్రీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల గారి కుమారుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ పూజారులు వేదమంత్రాల నడుమ అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, గ్రామ నాయకులు, భక్తులు, ప్రజలు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా దివ్యేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆరోగ్యం, అభివృద్ధి కోసం ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు.

# విద్యార్థుల పక్షపాతి మంత్రి నారా లోకేష్

**– 1,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల.**
**– మాట నిలబెట్టుకున్న యువనేత.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం హర్షం.**
**– లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన విద్యార్థులు, తెలుగు యువత.**
**– విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక కృషి.**





**కనిగిరి : ప్రజలకి చేరువ**
రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి లోకేష్ తీసుకున్న ఈ చొరవతో రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక భారం తొలగిపోయిందని విద్యా రంగ నిపుణులు, విద్యార్థి సంఘాలు కొనియాడుతున్నాయి.ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, కనిగిరి నియోజకవర్గ కేంద్రంలోని చర్చి సెంటర్ వద్ద తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తెలుగు యువత మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. “మాట ఇస్తే తప్పని నాయకుడు లోకేష్” అంటూ విద్యార్థులు నినాదాలతో హోరెత్తించారు.?ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు నాయకులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో నాణ్యత, పారదర్శకత మరియు సమగ్ర అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా మంత్రి లోకేష్ పనిచేస్తున్నారని కొనియాడారు. అలాగే, కనిగిరి నియోజకవర్గంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలోనూ, విద్యాభివృద్ధిలోనూ స్థానిక ఎమ్మెల్యే మరియు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న వేగం ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత ప్రతినిధులు, తెలుగు మహిళలు, విద్యార్థి నాయకులు మరియు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొని బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

# కందుకూరు టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రోన్ పైలెట్ శిక్షణ విద్యార్థినుల కేరింతలు

**కందుకూరు : ప్రజలకు చేరువ**
కందుకూరులోని టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా ఒక వినూత్న కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఫిజిక్స్ మరియు కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమం గురువారం నాటికి నాలుగవ రోజుకు చేరుకుంది. ప్రధాన మంత్రి – ఉచ్చతర్ శిక్షా అభియాన్ పథకంలో భాగంగా, అనంతపురం జిల్లా గుంతకల్లులోని ఎస్.కె.పి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక సహకారంతో మరియు ముంబైకి చెందిన ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ సౌజన్యంతో ఈ ఐదు రోజుల శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. గత నెల 9వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరం, రేపు నిర్వహించబోయే థియరీ పరీక్షతో ముగియనుంది.ఈ శిక్షణలో భాగంగా ఈరోజు నిర్వహించిన ప్రాక్టికల్ సెషన్స్ విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 5 లక్షల రూపాయల విలువైన డ్రోన్‌ను ఏరిస్ ఆగ్రో సంస్థ కళాశాలకు అందజేయడం విశేషం. నిపుణుల పర్యవేక్షణలో విద్యార్థినులు స్వయంగా డ్రోన్‌లను గాల్లోకి ఎగురవేయడం (టేకాఫ్), సురక్షితంగా దించడం (ల్యాండింగ్), ఎత్తును నియంత్రించడం మరియు దిశలను మార్చడం వంటి మెళకువలను నేర్చుకున్నారు. ముఖ్యంగా జీపీఎస్ ఆధారిత నావిగేషన్ వంటి అత్యాధునిక అంశాలపై వారికి ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. సాంకేతిక రంగంలో పురుషులతో సమానంగా





తాము కూడా రాణించగలమనే ఆత్మవిశ్వాసం ఈ శిక్షణ ద్వారా కలిగిందని విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ మాట్లాడుతూ, కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా ఇటువంటి ఆచరణాత్మక నైపుణ్యాలను అలవర్చుకోవడం వల్ల విద్యార్థులకు అద్భుతమైన ఉపాధి మరియు ఎంట్రప్రెన్యూర్ షిప్ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీ భవిష్యత్తులో వ్యవసాయం మరియు ఇతర రంగాల్లో కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్.వి. శ్రీహరి, వి. కృష్ణశర్మ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జె. హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర ఏడుకొండలు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. రాజగోపాల్ బాబుతో పాటు పలు విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# కందుకూరు పట్టణంలో భారీ వాహనాల రాకపోకలపై పోలీసుల ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**కందుకూరు : ప్రజలకి చేరువ**



పట్టణంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు పట్టణంలోకి ఎలాంటి భారీ వాహనాలకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే, స్థానిక వ్యాపారుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు, వారి వ్యాపార అవసరాల కోసం కేవలం మధ్యాహ్నం 1:00 గంట నుండి 3:00 గంటల వరకు మాత్రమే లారీలను పట్టణంలోకి అనుమతించేలా నిబంధనలను సవరించారు.?మిగిలిన సమయాల్లో, అనగా ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మరియు తిరిగి మధ్యాహ్నం 3:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు లారీలు, పొట్టు మరియు కర్రల లోడుతో ఉన్న ట్రాక్టర్లు వంటి ఏ రకమైన భారీ వాహనాలనైనా పట్టణంలోకి తీసుకురావడం నిషిద్ధం. ఈ నిబంధనలను అతిక్రమించి పట్టణంలోకి ప్రవేశించే వాహనదారులపై మరియు సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం మరియు సాఫీగా సాగే ట్రాఫిక్ వ్యవస్థ కోసం వ్యాపారులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

# గ్రామకంఠం రహదారిలో ఇంటి నిర్మాణం

**కనిగిరి : ప్రజలకు చేరువ**



కనిగిరి మున్సిపాలిటీ కి సంబంధించి చింతలపాలెం గ్రామ కంఠం లోని రహదారిలో ఇంటి నిర్మాణం జరుగుచున్న తీరు గురువారం వెలుగు లోనికి రావడం జరిగింది. చింతలపాలెం గ్రామానికి చెందిన షేక్ నసీబా తెలిపిన వివరాలు ప్రకారం తాను ఇంటిలోనుండి బయటకు రావడానికి వీలు లేకుండా నడుచుచున్న దారిలోనే కూ టా గుండ్ల మహబూబీ ఇంటి నిర్మాణం జరుగుతుంది అని మునిసిపల్ కమీషనర్ శ్రీధర్ వారికీ లిఖిత పూర్వకంగా పిర్యాదు చేయడం జరిగింది. దారిలో ఇంటి నిర్మాణం జరిగితే తనను గృహ నిర్భందన చేసినట్లు అవుతుందని కమీషనర్ ఎదుట నసీబా తన ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. ఈ విషయమై చింతలపాలెం ప్లానింగ్ అధికారి నవీన్ తో కమీషనర్ మాట్లాడుతూ వెంటనే ఇంటి నిర్మాణాన్ని ఆపి వేయాలని గ్రామకంఠం మరియూ ప్రభుత్వ స్థలాలకు సంబందించిన ప్రైవేట్ అగ్రిమెంట్స్ చెల్లుబాటు కావని నవీన్ కు తెలిపారు. రెండురోజుల్లో చింతలపాలెం వచ్చి రహదారి మార్గాన్ని పరిశీలన చేయడంతో పాటుగా నసీబాకు న్యాయం చేస్తానని కమీషనర్ తెలిపారు.

# కనిగిరిలో మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు వర్ధంతి వేడుకలు

**– నివాళులర్పించిన టిడిపి శ్రేణులు**





**కనిగిరి : ప్రజలకి చేరువ**
కనిగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత ఇరిగినేని తిరుపతి నాయుడు వర్ధంతి వేడుకలు గురువారం పట్టణంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు మరియు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపు మేరకు, పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ ఫిరోజ్ నేతృత్వంలో అమరావతి గ్రౌండ్ సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది.?కార్యక్రమంలో భాగంగా తొలుత ఇరిగినేని తిరుపతి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, నాయకులు మరియు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ, కనిగిరి రాజకీయ చరిత్రలో తిరుపతి నాయుడు ఒక ధ్రువతార అని కొనియాడారు. ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్న ఆయన, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం వల్లే ఆయన నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారని పేర్కొన్నారు.పదవుల కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యం అని నమ్మిన గొప్ప నాయకుడు తిరుపతి నాయుడు అని, ఆయన అడుగుజాడల్లో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు అభిమానులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.